నేడు జిల్లాలో తేలికపాటి వర్షం

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో సోమవారం అక్కడక్కడా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. అక్టోబరుచివరల్లో మొంథా తుఫాన్ కారణంగా జిల్లా చిగురుటాకుల వణికించింది. ఈ తుఫాన్ కారణంగా ప్రాణనష్టం లేకపోయినా ఆస్తినష్టం జరిగింది.

ఐఎస్‌వో పంచాయతీగా కార్వేటినగరం

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అంతర్జాతీయ ప్రమాణాల సంస్థ(ఐఎస్‌వో) గుర్తింపులో భాగంగా తొలి దశలో కార్వేటినగరం పంచాయతీ ఎంపికైంది. ప్రజలకు అందిస్తున్న పౌరసేవలు, ఫైల్స్ నిర్వహణ, సుపరిపాలన, ఘన వ్యర్థాల నిర్వహణ, పాలనలో పారదర్శకత, ధ్రువపత్రాల జారీ, జవాబుదారీతనం.. ఇలా 32 అంశాల్లో అత్యుత్తమ పనితీరు కనబరిచిన పంచాయతీలకు ఐఎస్‌వో సర్టిఫికెట్ జారీ కానుంది. రాష్ట్ర ప్రభుత్వం తొలి విడతగా 25 పంచాయతీలను గుర్తించగా అందులో కార్వేటినగరం ఉంది. ఈ పంచాయతీలో చేపట్టిన ప్రగతిని త్వరలో బృందం పరిశీలించి ఐఎస్‌వో ప్రమాణాల మేరకు గుర్తించి ధ్రువపత్రాల జారీకి సిఫార్సు చేస్తుందని డీపీవో సుధాకరరావు ఆదివారం తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

చిత్తూరు అర్బన్, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం జరిగే జిల్లా స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ కోరారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరిస్తామన్నారు. జిల్లా స్థాయి, డివిజన్, మండల స్థాయిల్లో కూడా అధికారులు పాల్గొని ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు.అలాగే జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ తుషార్ డూడీ ఒక ప్రకటనలో తెలిపారు. బాధిత ప్రజలు హాజరై సమస్యలను విన్నవించుకోవాలని కోరారు.

అసెంబ్లీ కమిటీ ఎదుటకు

డీసీసీబీ అక్రమాలు

- వైసీపీ పాలనా కాలంలో నిధుల దుర్వినియోగంపై నేడు విచారణ
- కమిటీ కోరిన వివరాలతో హాజరు కానున్న డీసీసీబీ సీఈవో
- గతంలో డీఆర్వో విచారణతో 48మంది ఉద్యోగులపై వేటు



నిరుపయోగంగా వున్న కుప్పంలో నిర్మించిన గోదాము

చిత్తూరు కలెక్టరేట్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు అక్రమార్కులపై చర్యలకు అడుగు ముందుకు పడింది. అయిదేళ్ల వైసీపీ పాలనలో చిత్తూరు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ)లో చోటు చేసుకున్న అవినీతి, నిధుల దుర్వినియోగంపై శాసనసభా సంఘం విచారణ చేపట్టనుంది. ఇందుకు సంబంధించి అనకాపల్లె ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ నేతృత్వంలో శాసనసభా కమిటీని స్పీకర్ అయ్యన్నపాత్రుడు నియమించారు. ఈ కమిటీలో చిత్తూరు జిల్లా నుంచి ఎమ్మెల్యే అమరనాథరెడ్డితో పాటు ఏడుగురు సభ్యులున్నారు.గత ఐదేళ్లలో ఇచ్చిన రుణాల వివరాలు, గోదాముల స్థితిగతుల గురించి శాసనసభా కమిటీ సమాచారం కోరిందని డీసీసీబీ సీఈవో శంకర్‌బాబు తెలిపారు.సోమవారం జరిగే విచారణకు కమిటీ కోరిన వివరాలతో హాజరవుతున్నామని ఆయన తెలిపారు.

పేరుకుపోయిన మొండి బకాయిలు

వైసీపీ పాలనా కాలంలో డీసీసీబీకి సెవెన్‌మెన్ కమిటీని, 75 సింగిల్ విండోలకు త్రిసభ్య కమిటీలను నియమించి బినామీల పేరుతో రుణాలను బొక్కేశారు. స్వల్పకాలిక రుణాల రూపంలో రూ.225కోట్లు, దీర్ఘకాలిక రుణాల రూపేణా రూ. 40కోట్లు, ఇతర రుణాల రూపేణా రూ. 150 కోట్ల మేరకు పంపిణీ చేశారు. భూమి లేకున్నా వైసీపీ కార్యకర్తలకు పంట రుణాలను ఇచ్చేసిన ఫలితంగా డీసీసీబీలో రూ. 105కోట్ల మేరకు మొండి బకాయిలు పేరుకుపోయాయి.ఇందులో అక్రమ రుణాలను అధికారులు గుర్తిస్తున్నారు. ఆయా వివరాలన్నీ సభాసంఘం ఎదుట పెట్టాలని ప్రభుత్వం ఆదేశించడంతో డీసీసీబీలో 2019-20 నుంచి 2023-24 వరకు ఐదేళ్ల లావాదేవీల చిట్టా విప్పారు.

బ్యాంకులపై ఒత్తిడి తెచ్చి...

జిల్లాలో జగనన్న తోడు, జగనన్న పాల వెల్లువ, కస్టమ్స్ హైరింగ్ సెంటర్లు, ఫిష్ ఆంధ్ర పథకాలకు రూ.కోట్లలో డీసీసీబీ నుంచి వాడేశారు. వాటిలో చాలా యూనిట్లు లేవు. ఏ పథకానికి ఎంతెంత రుణాలిచ్చారు, లబ్ధిదారులెవరు, బ్యాంకు గ్యారంటీ వివరాలతో సోమవారం సభాసంఘం ఎదుట హాజరుకావాలని అసెంబ్లీ కమిటీ ఆదేశించడంతో డీసీసీబీ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. జగనన్న తోడు పథకం ద్వారా రూ. 22 లక్షలు, జగనన్న పాల వెల్లువ ద్వారా రూ. 8 కోట్లు, కస్టమ్స్ హైరింగ్ సెంటర్ల ద్వారా రూ. 4కోట్లు , ఫిష్ ఆంధ్ర పేరుతో రూ. 32 లక్షలు తీసుకున్నప్పటికీ ఒక్క పైసా కూడా డీసీసీబీకి తిరిగి అందలేదు. పుత్తూరు, నగరి, శ్రీకాళహస్తి, తిరుపతి, పిచ్చాటూరు, వి.కోట, మదనపల్లె, పలమనేరు, బైరెడ్డిపల్లె, పుంగనూరు, డీసీసీబీ ప్రధాన కార్యాలయాల ద్వారా కోట్లాది రూపాయలు పంట రుణాల పేరిట అందించారు. వీటిలో 90శాతం వరకు వైసీపీ నేతలకే సరైన రికార్డుల్లేకుండా ఇచ్చేశారని సమాచారం. పలు బ్యాంకు శాఖల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. అప్పటి మంత్రి పెద్దిరెడ్డి, వైసీపీ నేత కృష్ణమూర్తి ఆదేశాలతో పాలకవర్గ సభ్యులు వారి బంధువుల పేర్లతో రికార్డులు లేకుండా రూ. 10కోట్ల వరకూ తీసుకున్నారు. ఇందులో ఒక్క పైసా కూడా తిరిగి వసూలు కాలేదు.

ఎవరి కోసం గోదాములు..?

జిల్లాలోని 75 సహకార సంఘాల్లో 50 శాతం నష్టాల్లోనే ఉన్నాయి, గత ప్రభుత్వం ఇష్టారాజ్యంగా అవసరమున్నా...లేకున్నా గోదాములను నిర్మించారు. ఒక్కో గోదాముకు రూ. 40 లక్షల చొప్పున సహకార సంఘం ద్వారా కాంట్రాక్టర్లకు చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారు. 63 గోదాములను నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం కాగా 57 గోదాముల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. వాటిలో 46 నిర్మాణాలు చేపట్టగా 34 మాత్రమే పూర్తయ్యాయి. 500 మెట్రిక్ టన్నుల కెపాసిటీతో నిర్మించిన గోదాములకోసం సింగిల్‌విండోలు తీసుకున్న రూ.40 లక్షలను నాలుగుశాతం వడ్డీతో ఏడు సంవత్సరాల్లో డీసీసీబీకి చెల్లించాల్సి వుంది. అయితే నిర్మించిన గోదాములు ఇప్పటికీ నిరుపయోగంగా వుండడంతో వాటిపై రాబడిలేకుండా పోయింది.

అమూల్ రుణాల పేరిట అక్రమార్జన

వాయిదా మీరిన అన్ని రకాల రుణాలను మాఫీ చేస్తామంటూ కొంతమంది డీసీసీబీ డైరెక్టర్లు రైతుల నుంచి కమీషన్లు వసూలు చేశారు.పాడి పశువులు కొన్నట్లు చూపిన వైసీపీ శ్రేణులు కొన్ని బ్యాంకు శాఖల ద్వారా, సింగిల్ విండోల ద్వారా ఆమూల్ రుణాలు పొందారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి ఆదేశాలతో డీసీసీబీ నుంచే వీరికి రూ. 20 కోట్ల దాకా రుణాలు ఇచ్చినట్లు ప్రచారం జరిగింది. ఇదిలా ఉండగా ప్రభుత్వ ఆదేశాల మేరకు గతంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ సహకార చట్టం 51 సెక్షన్ కింద విచారణ చేపట్టారు.డీఆర్వో మోహన్ కుమార్‌తో విచారణ చేయించి పూర్తి వివరాలను నివేదిక రూపంలో తీసుకున్నారు. 48 మంది బ్యాంకు ఉద్యోగులపై చర్యలు చేపట్టారు. పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందించారు. డీఆర్వో ఇచ్చిన నివేదికలో రూ. 23కోట్ల మేర అవినీతి జరిగినట్లు తేల్చారు.

కాణిపాకం కిటకిట

- స్వామి దర్శనానికి ఐదు గంటల సమయం



ఆలయ వెలుపల స్వామి దర్శనార్థం ఉన్న భక్తులు

ఐరాల(కాణిపాకం), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాణిపాకం ఆదివారం భక్తులతో పోటెత్తింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు ఆలయానికి వస్తూనే ఉన్నారు. అధిక సంఖ్యలో భక్తులు రావడంతో క్యూలైన్లు పూర్తిగా నిండి పోయి ఆలయం వెలుపల వరకు భక్తులు వెల్లువెత్తారు. స్వామి దర్శనానికి సుమారు ఐదు గంటల సమయం పట్టింది. క్యూలైన్లలో భక్తులు ఇబ్బందిపడకుండా ఈవో పెంచలకిషోర్ దగ్గరుండి క్యూలైన్లను పర్యవేక్షించారు. ప్రతి భక్తుడికి స్వామి దర్శనం కలిగేందుకు అధికారులు కృషి చేశారు.

బాబుపై నమ్మకంతోనే భారీ పెట్టుబడులు

- సీఐఐ సదస్సు విజయవంతంపై నేతల హర్షం

చిత్తూరు సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విశాఖ సీఐఐ సదస్సు సూపర్ హిట్ అయిందని ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఎంపీ దగ్గుమళ్ల పసాదరావు మాట్లాడుతూ సీఐఐ సదస్సుతో మనరాష్ట్రం ప్రగతితో పాటు నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వీలవుతుందన్నారు. సుమారు రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులతో 613 ప్రముఖ కంపెనీలు ఒప్పందాలు కుదుర్చుకున్నాయన్నారు. ఫలితంగా 16 లక్షల మందికి ఉద్యోగావకాశాలు ఏర్పడతాయన్నారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ సీఎం నారా చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి లోకేష్‌లె ప్రపంచ దేశాలు తిరిగి ప్రముఖ కంపెనీలను రాష్ట్రానికి తీసుకువచ్చారని చెప్పారు. పరకామణి కేసులో సీఐ సతీష్ కుమార్ మరణంపై వైసీపీ నేతలు అత్యుత్సాహం ప్రదర్శించి ఇరుక్కున్నారన్నారు. సతీష్ కుమార్ హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నించారని చెప్పారు. ఏపీ పోలీసులు సమర్థంగా పనిచేస్తున్నారని త్వరలోనే అసలు దోషులను అరెస్టు చేస్తారని చెప్పారు. ఎమ్మెల్సీ కంచెర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ ఇప్పుడు ప్రపంచమంతా వైజాగ్ వైపు చూస్తోందని కొనియాడారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళి మోహన్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో ఉపాధి దొరకక ఇతర ప్రాంతాలకు వలసవెల్లిన నిరుద్యోగులు ఇప్పుడు రాష్ట్రానికి తిరిగి వస్తున్నారన్నారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ హత్య జరిగినా దాని వెనుక వైసీపీ నేతల కుట్ర ఉంటోందన్నారు. పరిటాల రవి, వైఎస్ వివేకానంద రెడ్డి హత్యల్లాగే సురేష్ కుమార్ హత్యలో కూడా సాక్షులను లేకుండా చేసే ప్రమాదముందన్నారు. ఏ ఆధారమూ లేకుండా సురేష్ కుమార్ మరణాన్ని కరుణాకర్ రెడ్డి ఆత్మహత్యగా ఎలా ప్రచారం చేశారని ప్రశ్నించారు. పార్టీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్, మోహన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

నేడు డయల్ యువర్ డిస్కం సీఎండీ

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని సదరన్ డిస్కం కేంద్ర కార్యాలయంలో సోమవారం 'డయల్ యువర్ ఏపీ ఎస్‌పీడీసీఎల్ సీఎండీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ సీఎండీ శివశంకర్ ఆదివారం తెలిపారు. గృహ, వ్యవసాయ, పరిశ్రమలు, వ్యాపార రంగాల విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలపై ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఫోను చేసి ఫిర్యాదు చేయొచ్చన్నారు. 89777 16661 నెంబరుకు ఫోనుచేసి.. 91333 31912 నెంబరుకు చాట్ చేసి సమస్యలను ప్రస్తావిస్తే, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

అప్పు తీర్చమన్నందుకు హత్య

- నిర్మాణంలో ఉన్న ఇంటిలో శవం పూడ్చివేత
- కుప్పంలో దారుణం





గొయ్యినుంచి వెలికి తీస్తున్న శ్రీనాథ్ మృతదేహం - హతుడు శ్రీనాథ్ (ఫైల్ ఫొటో)

కుప్పం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన అప్పును తీర్చమన్న పాపానికి శ్రీనాథ్ (38) అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు.నిర్మాణంలో ఉన్న ఇంట్లో గొయ్యి తవ్వి, కంకర కప్పి శవాన్ని నిందితుడు ప్రభాకర్ పూడ్చిపెట్టాడు. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ పోలీసుల శోధనలో బయటపడ్డ ఈ దారుణ సంఘటన కుప్పంలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు...శ్రీనాథ్, ప్రభాకర్ పెదనాన్న చిన్నాన్న కొడుకులు.కుప్పం మున్సిపాలిటీ దళవాయికొత్తపల్లెకు చెందిన శ్రీనాథ్ (38) కుటుంబం 20 ఏళ్ల క్రితం కర్ణాటక రాష్ట్రానికి వలస వెళ్లింది. బెంగళూరు సరిహద్దుల్లోని అత్తిబెలలో నివసిస్తోంది. రామకుప్పం మండలం ముద్దనపల్లెకు చెందిన ప్రభాకర్ కుటుంబం కూడా బెంగళూరులోనే నివాసం ఉంటోంది. ప్రభాకర్ గతంలో ఒక హత్య కేసులో జీవితకాల శిక్ష పడి, 2023లో విడుదలయ్యాడు. సాఫ్ట్‌వేర్ కంపెనీలో చేస్తున్న శ్రీనాథ్, రెండేళ్ల క్రితం బెంగళూరులో ఇల్లు కట్టుకున్నాడు. గృహప్రవేశానికి వెళ్లిన ప్రభాకర్..... శ్రీనాథ్ ఆర్థిక స్థాయి గమనించాడు. బిజినెస్ చేస్తానని, అందులో వచ్చే లాభాలతో హౌసింగ్ లోన్ తీర్చేయవచ్చని ఆశపెట్టి, శ్రీనాథ్‌నుంచి ఏడాది క్రితం సుమారు రూ.40 లక్షల రుణం తీసుకున్నాడు. ఆరునెలల్లో లాభంతోపాటు తీసుకున్న రుణం ఇచ్చేస్తానని చెప్పిన ప్రభాకర్ ఇచ్చిన నగదు కూడా చెల్లించలేదు. ఈలోగా శ్రీనాథ్ కుమార్తెకు ఆరోగ్య సమస్య తలెత్తి వైద్యంకోసం డబ్బు అవసరమైంది. ఇచ్చిన అప్పు తీర్చాల్సిందిగా ప్రభాకర్‌పై వొత్తిడి తెచ్చాడు. ఇచ్చే ఉద్దేశం లేని ప్రభాకర్ ఎలాగైనా శ్రీనాథ్ అడ్డు తొలగించుకుంటే ఈ బెడద తప్పుతుందని భావించాడు. చిత్తూకు చెందిన, గతంలో హత్య కేసులో జైలుకు వెళ్లొచ్చిన జగదీశ్ అనే స్నేహితుడితో కలిసి శ్రీనాథ్ హత్యకు ప్లాన్ చేశాడు. అప్పు తిరిగి చెల్లిస్తానని చెప్పి, గత అక్టోబరు నెల 16, 18 తేదీల్లో శ్రీనాథ్‌ను కుప్పం పిలిపించాడు. అయితే హత్యకు అనుకూల పరిస్థితులు లేకపోవడంతో ఏదో సాకు చెప్పి పంపించేశాడు. మళ్లీ అదే నవంబరు నెల 27వ తేదీన శ్రీనాథ్‌ను కుప్పం పిలిపించాడు. తాను బ్లాక్ మనీ ద్వారా వ్యవహారాలు నడుపుతుంటానని, ఫోన్ తీసుకు వస్తే పోలీసులకు తెలిసిపోతుందని నమ్మబలికి, ఫోన్ లేకుండా రమ్మన్నాడు. గుడ్డిగా నమ్మిన శ్రీనాథ్ ఫోన్ ఇంట్లోనే పెట్టి కుప్పం వచ్చాడు. అమరావతి కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇటీవల కొనుగోలు చేసిన సొంత ఇంటికి ప్రభాకర్, అతడిని తీసుకుని వెళ్లాడు. అక్కడ స్నేహితుడు జగదీశ్‌తో కలిసి శ్రీనాథ్ తలపై సుత్తితో కొట్టి హత్య చేశాడు. రెండుమూడు రోజుల క్రితమే ఇంట్లో తవ్విపెట్టిన గోతిలో అతడి శవాన్ని పెట్టి, కంకరతో పూడ్చివేశాడు. మరోవైపు నవంబరు నెల 27వ తేదీనుంచి భర్త శ్రీనాథ్ కనిపించకుండా పోవడంతో ఆయన భార్య నేహ కర్ణాటక పోలీసులకు ఫిర్యాదు చేసింది. అంతేకాదు, ప్రభాకర్‌కు భర్త అప్పు ఇవ్వడం, ఇచ్చిన అప్పు రాబట్టుకోవడం అతను తరచూ కుప్పం వెళ్తుండడం గురించి కూడా తెలియజెప్పింది. దీంతో పోలీసులు ప్రభాకర్‌ను, అతడి స్నేహితుడు జగదీశ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా హత్య విషయం బయటపడింది. ఈ నేపథ్యంలో కర్ణాటక పోలీసులు ఆదివారం కుప్పం వచ్చి, హత్య జరిగిన ఇంటివద్దకు వెళ్లి గోతిలో పూడ్చిపెట్టిన శ్రీనాథ్ శవాన్ని బయటకు తీశారు.పోస్టుమార్టానికి పంపి, అనంతరం బంధువులకు అప్పగించారు. కుప్పం పోలీసుల సహకారంతో కర్ణాటక పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.



ముద్దాయి ప్రభాకర్





శ్రీనాథ్‌ను హత్యచేసి పూడ్చిపెట్టిన ఇల్లు - అమరావతి కాలనీలోని ఘటనా స్థలం వద్ద రోదిస్తున్న బంధువులు

చక్కని తల్లికి ఛాంగుభళా!

- పద్మావతీ దేవి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

తిరుచానూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలకు ఆదివారం సాయంత్రం పాంచరాత్ర ఆగమ శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. సాయంత్రం 6.30 గంటలకు అమ్మవారి సన్నిధి ముఖమండపం వద్ద సర్వసేనాధిపతి విష్వక్సేనుడిని కొలువుదీర్చారు. కంకణభట్టాచార్యుడు వేంపల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో అర్చకులు పుణ్యాహవచనం, రక్షాబంధనం వంటి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విష్వక్సేనుడిని వేంచేపుగా ఉద్యానవనానికి తీసుకొచ్చి పుట్టమన్ను సేకరించారు. ఆ పుట్టమన్నును ఆలయ మాడవీధుల్లో ఊరేగింపుగా ఆలయంలోని యాగశాలకు తీసుకొచ్చి నవపాలికల్లో నింపారు. అందులో నవధాన్యాలు వేసి అంకురార్పణకు శ్రీకారం చుట్టారు.



పుట్టమన్ను సేకరిస్తున్న అర్చకులు



ఉదయం.. లక్ష కుంకుమార్చన

ఉదయం పూజల అనంతరం పద్మావతి అమ్మవారిని శ్రీకృష్ణస్వామి ముఖమండపానికి తీసుకొచ్చి సర్వభూపాల వాహనంపై కొలువుదీర్చారు. 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అర్చకులు అమ్మవారి లక్ష్మీసహస్ర నామాలను లక్షసార్లు జపిస్తూ కుంకుమార్చన చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

- ఉదయం 9.10 నుంచి 9.30 గంటల మధ్య ధ్వజారోహణం జరగనుంది. తొలుత అమ్మవారితో పాటు గజచిత్రపటాన్ని తిరువీధుల్లో ఊరేగిస్తూ ఆలయానికి తీసుకొస్తారు. గజ చిత్రపటాన్ని ధ్వజస్తంభంపైకి ఎగుర వేయడంతో ధ్వజారోహణం ముగుస్తుంది.
- మొదటి ఏడు రోజులు శ్రీకృష్ణస్వామి ముఖ మండపంలో, ఎనిమిదో రోజు రథమండపంలో మధ్యాహ్నం అమ్మవారికి స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. చివరి రోజైన తొమ్మిదో రోజు పంచమితీర్థం సందర్భంగా ఉదయం 10 గంటలకు అమ్మవారితో పాటు చక్రత్తాళ్వార్‌కు పంచమితీర్థం మండపంలో స్నపన తిరుమంజనం జరుగుతుంది.
- రోజూ సాయంత్రం 5.30 నుంచి 6గంటల వరకు ఆస్థాన మండపంలో ఊంజల్‌సేవ నిర్వహించనున్నారు. సాయంత్రం 7 నుంచి రాత్రి 9 గంటల వరకు చిన్నశేషవాహనంపై అమ్మవారు ఊరేగనున్నారు. దీంతో వాహన సేవలు మొదలవుతాయి.

ముత్యపు కవచంలో అమ్మవారు

పద్మావతి అమ్మవారు ఆదివారం ముత్యపు కవచంలో భక్తులకు దర్శనమిచ్చారు. రోజూ వజ్ర, వైఢూర్య, స్వర్ణాభరణాలతో దర్శనమిస్తారు. బ్రహ్మోత్సవ వేళ మాత్రమే అమ్మవారి మూలవర్లకు ప్రత్యేకంగా తయారు చేయించిన ముత్యపు కవచాన్ని అలంకరిస్తారు.

పుస్తక లక్షాధికారి

లంకా సూర్యనారాయణకు నేడు జీవిత సాఫల్య పురస్కార ప్రదానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చూడ్డానికి సాదాసీదాగా కన్పించే లంకా సూర్యనారాయణ లక్షకు పైగా పుస్తకాలు సేకరించి, సంరక్షిస్తున్నారంటే ఆశ్చర్యమేస్తుంది.గుంటూరులో పుస్తకాభిమానులు ముద్దుగా గ్రంథాళ్వార్‌గా పిలుచుకునే ఆయన గ్రంథాలయంలో చదువుకున్న అనేక మందికి ప్రపంచ విజ్ఞానం ఒంటబట్టింది.కుమారుడు కూడా వరంగల్ నిట్‌లో ప్రొఫెసర్ స్థాయికి ఎదిగారు. ఎస్వీయూనివర్శిటీలోని శ్రీనివాసా ఆడిటోరియంలో సూర్యనారాయణకు నేడు జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు. ఈ సందర్భంగా ఆయనతో ఆంధ్రజ్యోతి సంభాషణ..

నేపథ్యం

మాది గుంటూరు జిల్లా పెదగొట్టిపాడు గ్రామం. వ్యవసాయ కుటుంబం.అమ్మానాన్న పెదలక్ష్మీనారాయణ, రంగనాయకమ్మ. పత్తిపాడు హైస్కూల్లో పదవ తరగతి వరకూ గుంటూరులో బీఎస్సీ దాకా చదివా. కస్టమ్స్ శాఖలో సూపరిండెంట్‌గా పని చేసి రిటైరయ్యా. శ్రీ వేంకటేశ్వర ధార్మిక సేవా సమితి, అన్నమయ్య సేవా సమితి, స్వధర్మ సేవా సమితి అధ్యక్షులుగా పని చేశా.

పుస్తకాలపై ఆసక్తి

గాలీ నీరూ వెలుగూ అందరికీ ఎలా లభిస్తున్నాయో, పుస్తకాలు కూడా అంతగా అందుబాటులో ఉండాలనే చిలకమర్తి లక్ష్మీనరసింహం వ్యాఖ్య నాకు నిత్యస్ఫూర్తిని కలిగిస్తుంటుంది. దీంతో పాటు మా బాబాయి ఉప్పలపాటి ఆనందరావు కమ్యూనిస్టు కార్యకర్త. ఆయనకు విపరీతమైన పుస్తకాల పిచ్చి. ఆయన ద్వారా పుస్తకాలకు చేరువై లెక్కకుమించి చదివా.

గ్రంథాలయ ఏర్పాటుకు బీజం

గుంటూరులో అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంథాలయం ఏర్పాటు చేయాలనే ఆసక్తి కలిగింది.పుస్తకాలను సేకరించి, గ్రంథాలయంలో కొలువుదీర్చా. అనేకమంది సాహితీప్రముఖులు, పుస్తకాభిమానులు సందర్శిస్తుండడం చూసి నేను కూడా పుస్తక విజ్ఞాన వ్యాప్తికి కృషి చేస్తున్నాననే అనుభూతి కలుగుతుంది.ఈ గ్రంథాలయాన్ని భవిష్యత్తు తరానికి కూడా అందించాలనుకుంటున్నా.

పుస్తకాల సేకరణ


మా కుటుంబ వ్యక్తిగత గ్రంథాలయంలోనే 80 వేల పుస్తకాలుండేవి. అనేక మంది ప్రముఖులు మా ఇంటి లైబ్రరీకి వచ్చి పుస్తకాలు చదువుకునే వారు. ఇప్పుడు ఈ సంఖ్య లక్షా 30 వేలకు చేరింది. 100 మహా భాగవతాలు, 300 భాగవతాలు, 500 భగవద్గీతలు, 550 రామాయణాలు, 5 వేల ఆత్మకథలు, 51మంది అనువాదకులు చేసిన అనువాద గ్రంథాలు, 1600 శతకాలు, 700 నిఘంటువులు సేకరించా. వీటిలో ఏ పుస్తకమైనా కేటలాగ్ అవసరం లేకుండా క్షణాల్లో చేతికి అందించగలను. తెలుగు, ఇంగ్లీషు, హిందీ వంటి భాషలకు సంబంధించిన పుస్తకాలు కూడా అనేకం ఉన్నాయి. వివిధ భాషా, సాహిత్య రంగాల్లో పరిశోధన చేసే వారికి ఈ గ్రంథాలయం బాగా ఉపయోగపడుతుంది.

పుస్తకాభిమానులకు సలహా

పుస్తకాలను కొని చదవడమే కాదు, నలుగురికి అందించడం గొప్ప విషయం. మనం తెలుసుకున్న మంచి విషయాలను నలుగురికి తెలియజేయడం అవసరం. ఇది మనకు సంతృప్తిని కలిగించడమే కాక సమాజానికి కూడా మంచి చేస్తుంది.పుస్తకాన్ని మనం చదవడంతో పాటు అందరికీ చేరువ చేయడం పుస్తకాభిమానుల బాధ్యత.

లభించిన గుర్తింపు

నవ్యాంధ్ర రాష్ట్ర తొలి ఉగాది కళారత్న పురస్కారం పొందా.శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2017లో కీర్తి పురస్కారంతో సత్కరించింది. 2018లో అజోవిభో కందాళం పురస్కారాన్ని స్వీకరించా. జానుమద్ది హనుమచ్ఛాస్త్రి పురస్కారం, పాతూరి నాగభూషణం పురస్కారం, బొమ్మిడాల కృష్ణమూర్తి ఫౌండేషన్ వారి పురస్కారం, అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారి సేవారత్న పురస్కార, సత్కారాలతో గుర్తింపు పొందా.



లక్ష్యం

ప్రస్తుతం తొంభై ఏళ్ల వయసులో ఒకే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నా. సేకరించిన పుస్తకాలను శాశ్వతంగా పరిరక్షించడానికి డిజిటలైజ్ చేయాలనే ఆలోచనలో ఉన్నా.ఇందుకు పుస్తకాభిమానుల సహకారాన్ని కోరుతున్నా.

పీఆర్ ఇంజనీర్స్ అసోసియేషన్ కార్యవర్గం



జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీర్స్ అసోసియేషన్ సభ్యులు

చిత్తూరు సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏపీ పంచాయతీరాజ్ ఇంజనీర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలోని విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ కార్యాలయం ఆవరణలో ఎస్సీ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా పి.గోవర్ధన్ క్రిష్ణ, ఉపాధ్యక్షుడుగా టీవీ ప్రసాద్ నాయుడు, ప్రధాన కార్యదర్శిగా వి.అజయ్, కోశాధికారిగా యస్.షమీరాను ఎన్నుకున్నారు.

వరసిద్ధుడి సేవలో హీరో సాయిధరమ్‌తేజ్



సాయిధరమ్‌తేజ్‌కు జ్ఞాపికను అందిస్తున్న ఈవో పెంచలకిషోర్

ఐరాల(కాణిపాకం), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాణిపాకం వరసిద్ధుడిని ఆదివారం సినీ హీరో సాయిధరమ్‌తేజ్ దర్శించుకున్నారు. ఆయన్ను ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో ఏఈవో రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

లిక్విడ్ గంజాయి కలకలం



లిక్విడ్ గంజాయి బాటిల్

చంద్రగిరి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం ఎగువ రెడ్డివారి పల్లె సమపంలోని స్వర్ణముఖినది పరిసరాల్లో లిక్విడ్ గంజాయి బాటిల్ దొరికింది. దీంతో ఆదివారం స్థానికంగా కలకలంరేగింది. కర్మక్రియల మండపం (షెడ్డు) వద్ద కొంతమంది యువకులు రోజూ మద్యం తాగడం, బాటిల్లో నింపిన గంజాయిని పొగబెట్టి పీల్చుతూ మత్తులో జోగుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. పదేపదే పొలాల వద్దకు రావద్దని వారికి చెప్పినా వినడం లేదన్నారు. దీంతో మహిళలు ఒంటరిగా తమ పొలాలకు వెళ్లాలన్నా భయపడుతున్నట్లు తెలిపారు.

రాష్ట్రానికి క్యూ కడుతున్న పరిశ్రమలు

ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



పలమనేరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సీఐఐ భాగస్వామ్య సదస్సులో రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు సమానంగా పెట్టుబడులు రావడం ప్రభుత్వ వికేంద్రీకరణ నిబద్ధతకు నిదర్శనమని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. సీఐఐ సమ్మిట్ విజయవంతం కావడంపై ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు.ప్రతి రాష్ట్రం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను అనుసరిస్తుంటే ఏపీ అందుకు భిన్నంగా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను అనుసరిస్తుండటంతో రాష్ట్రానికి పరిశ్రమలు క్యూ కడుతున్నాయన్నారు.ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడుల హబ్‌గా మార్చేందుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ వ్యూహాత్మకంగా చేసిన కృషికి ఈ సదస్సు ప్రతిఫలంగా నిలిచిందని కొనియాడారు. సమ్మిట్‌లో పవర్ సెక్టార్‌లో కుదుర్చుకొన్న అధిక శాతం పెట్టుబడులు రాయలసీమకే రావడం చూస్తుంటే ఈ ప్రాంత అభివృద్ధిపై ముఖ్యమంత్రి ఎంత శ్రద్ధ పెడుతున్నారో అర్థమవుతుందన్నారు. ఇక రాయలసీమ కేంద్రంగా ఏరోస్పేస్ రంగాల్లో రూ.1200 కోట్లతో రెమాస్ సంస్థ పెట్టుబడులు పెట్టడం భవిష్యత్‌లో రాయలసీమ, ఏరోస్పేస్ సిటీగా ఎదిగేందుకు దోహదం కానుందన్నారు.

సీఐఐతో ఏపీపై ప్రపంచ దృష్టి

- ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సిటీ, నవంబరు 16 (ఆంధ్రప్రదేశ్): విశాఖ సీఐఐ సమిట్‌తో ప్రపంచం దృష్టి ఏపీపై మళ్లిందని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెట్టుబడులకు ఏపీనీ గమ్యస్థానంగా మార్చడంలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లు తమ ప్రావీణ్యాన్ని నిరూపించారన్నారు. రాష్ట్రం. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో అన్ని రంగాల్లో నష్టపోయిందన్నారు. కూటమి సీఎం చంద్రబాబు అనుసరిస్తున్న విధానాలు, మంత్రి నారా లోకేష్ అమలు చేస్తున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ఆకర్షితులై ప్రముఖ కంపెనీలు ఇప్పుడు రాష్ట్రానికి వస్తున్నాయన్నారు.

గంగమ్మ నామస్మరణతో మార్మోగిన బోయకొండ





క్యూలైన్లలో వేచివున్న భక్తులు - ప్రత్యేక అలంకరణలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ ఆదివారం గంగమ్మ భక్తులతో కిటకిటలాడింది. వేకువ జామునే అమ్మవారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి పంచామృతాలతో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని స్వర్ణాభరణాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.

సరదాగా ఈతకు వెళ్లి బావ, బామ్మర్ది మృతి



శివ, నరేష్ మృతదేహాల వద్ద విలపిస్తున్న కుటుంబీకులు, బంధువులు

రేణిగుంట నవంబర్ 16 (ఆంధ్రజ్యోతి): సరదాగా ఈత కొట్టేందుకు ఆదివారం మల్లిమడుగు డ్యామ్ వద్దకెళ్లారు. అక్కడి గుంతలోకి దిగి బావ, బావమరిది మృతి చెందారు. ఎస్‌ఐ నాగరాజు తెలిపిన ప్రకారం.. తిరుపతి మల్లగుంటకు చెందిన నర్సింగ్ శివ (32), దర్శి నరేష్(36) బావ, బావమరుదులు. స్థానికంగా జీపు నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ ఇద్దరు తమ స్నేహితుడు చంద్రశేఖర్‌తో కలిసి ఆదివారం సరదాగా గడిపేందుకు రేణిగుంట మండలంలోని మల్లిమడుగు డ్యాంకు వచ్చారు. గేట్లకు సమీపంలోని గుంతలో ఈత కొట్టేందుకు శివ వెళ్లారు. ఈత కొడుతూ లోతైన ప్రాంతంలోకి వెళ్లడంతో కేకలు వేస్తూ మునిగిపోతుండగా.. ఒడ్డుపై ఉన్న నరేష్ అతడిని రక్షించేందుకు నీటిలో దూకాడు. వీళ్లిద్దరూ మునిగిపోతుండగా చంద్రశేఖర్ పెద్దగా కేకలు వేస్తూ సమీపంలోని గ్రామంలోకి పరుగులు తీశారు. స్థానికులు డ్యాం వద్దకు చేరుకుని నీటిలో మునిగిపోయిన శివ, నరేష్ కోసం గాలించారు. ఇంతలో రేణిగుంట అర్బన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మునిగిపోయిన వ్యక్తులను స్థానికులు వెలికి తీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రుయాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

హెచ్చరిక బోర్డు పెట్టినా..

మల్లిమడుగు డ్యాం వద్ద నీటి ప్రవాహం అధికంగా ఉన్న సమయంలో సందర్శకులను నిషేధిస్తారు. డ్యాం అధికారులు ప్రధాన గేటు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా సందర్శకులు లెక్క చేయడం లేదు. డ్యాం దిగువ ప్రాంతాల్లోకి వెళ్లి మద్యం తాగుతుంటారు. మద్యం మత్తులో ఈత కొట్టేందుకు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు.



డ్యామ్ గేట్ల ముందు సందర్శకులు

వృద్ధ దంపతులపై ఒంటరి ఏనుగు దాడి





గాయపడ్డ రెడ్డెమ్మ ఆస్పత్రికి తరలింపు - నడవలేని స్థితిలో సుబ్రహ్మణ్యం

కల్లూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి):పులిచెర్ల మండలం కల్లూరు-సదుం మార్గంలోని పాతపేట బస్టాపు వద్ద ఆదివారం వేకువజామున ఒంటరి ఏనుగు దాడిలో వృద్ధ దంపతులకు తీవ్రగాయాలయ్యాయి. బాధితుల కథనం మేరకు .... పాతపేటకు చెందిన దంపతులు ఎం.సుబ్రహ్మణ్యం (75), ఎం.రెడ్డెమ్మ (60) తమ కుమారుడు శివకుమార్ దగ్గరకు వెళ్లేందుకు ఆదివారం వేకువజామున తిరుపతికి బయలుదేరారు. సుమారు 5 గంటల సమయంలో కాలినడకన పాతపేట బస్టాపు వద్దకు ఈ దంపతులు చేరుకున్నారు. బస్టాపు ఎదురుగా మంగళంపేటకు చెందిన రామకృష్ణయ్య మామిడి తోట నుంచి ఒంటరి ఏనుగు రోడ్డుపైకి చేరుకోవడంతో ఉలిక్కిపడి కేకలు పెట్టారు. ఈ దంపతుల వద్ద ఉన్న కూరగాయల బ్యాగును గమనించిన ఒంటరి ఏనుగు వీరిపై దాడి చేసింది. కూరగాయల బ్యాగును లాక్కొని ధ్వంసం చేసిన ఏనుగు ఘీంకారాలు చేసుకుంటూ మామిడితోటలోకి వెళ్లిపోయింది. వృద్ధ దంపతులు కింద పడి ఉండడాన్ని గమనించిన వాహనదారులు గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. లేచి నిలబడలేని పరిస్థితికి చేరుకున్న దంపతులను కల్లూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి ప్రథమచికిత్స అందించారు. అనంతరం తిరుపతికి తరలించారు. సుబ్రహ్మణ్యంకు స్వల్ప గాయాలయ్యాయని, రెడ్డెమ్మకు నడుం, నాలుగు ఛాతీ ఎముకలు విరిగాయని వైద్యులు తెలిపారు.

చిన్నగొట్టిగల్లు మండలంలోకి 16 ఏనుగుల మంద

పులిచెర్ల మండలంలో కొన్ని నెలలుగా పంటలను ధ్వంసం చేస్తున్న 16 ఏనుగుల మంద శనివారం వేకువజామున తిరుపతి జిల్లా చిన్నగొట్టిగల్లు మండలంలోకి వెళ్లినట్లు అటవీశాఖ సిబ్బంది తెలిపారు. శుక్రవారం రాత్రి పులిచెర్ల మండలంలోని కమ్మపల్లి, రెడ్డివారిపల్లి పంచాయతీల్లో పంటలను నాశనం చేసిన ఈ ఏనుగుల మంద చిన్నగొట్టిగల్లు మండలంలోని రేడ్డేరి గుట్ట వైపు వెళ్లిపోయాయి. శనివారం రాత్రి మండలంలోకి ఏనుగుల మంద తిరిగి రాకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

పంట పొలాలపై గజరాజుల బీభత్సం

భాకరాపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : చిన్నగొట్టిగల్లు మండలంలో పంట పొలాలపై ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. మండలంలోని ఎగువూరు గ్రామం వులసలవాండ్లపల్లెకు చెందిన తారకేశవ, జయరామయ్యకు చెందిన మామిడి తోటలకు వేసిన కూసాలను ధ్వంసం చేశాయి. అదే గ్రామానికి చెందిన మరో రైతు వరి పంటను ధ్వంసం చేసి సమీపంలోని మీసాల వంక ప్రాంతానికి వెళ్లాయని అటవీ శాఖ అధికారులు తెలిపారు. ఆదివారం రాత్రి బొగ్గలవాండ్లపల్లె, పాలకుమాలపల్లె, గాండ్లపల్లెవైపు వచ్చే అవకాశమున్నందున రైతులెవరూ అటు వైపు వెళ్లవద్దని హెచ్చరించారు.





ధ్వంసమైన టమోటా, వరి పంటలను చూపుతున్న రైతులు

నారా రామ్మూర్తికి నివాళి



చంద్రగిరి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని నారావారిపల్లెలోని ఎన్‌ఆర్‌ఎన్ ఘాట్ వద్ద ఆదివారం నారా కుటుంబ సభ్యులు, అభిమానులు ఘనంగా నివాళులర్పించారు. రామ్మూర్తి నాయుడు సతీమణి ఇందిర, కుమారుడు, సినీనటుడు నారా రోహిత్, సతీమణి శిరీష, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు, టీడీపీ నాయకులు హేమంత్ రాయల్, తానికొండ రంజిత్, నారా సుబ్రమణ్యంనాయుడు, నారా కేశవులునాయుడు ఎన్‌ఆర్‌ఎన్ ఘాట్ వద్ద పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

ముక్కంటి సేవలో జస్టిస్ సూర్యకాంత్



శ్రీకాళహస్తి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి):సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఎంపికైన జస్టిస్ సూర్యకాంత్ ఆదివారం కుటుంబ సమేతంగా జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని దర్శించుకున్నారు. ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టే సాయి, ఈవో బాపిరెడ్డి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు జస్టిస్‌ను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. జిల్లా న్యాయమూర్తి అరుణ సారిక, ప్రొటోకాల్ జడ్జి గురునాథం, స్థానిక న్యాయమూర్తులు శ్రీనివాసనాయర్, బేబీ రాణి, కృష్ణప్రియ తదితరులు పాల్గొన్నారు.

పావుకోళ్లు కవితా సంపుటి ఆవిష్కరణ



గంగవరం, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): మానవ హృదయ సంవేదనలకు అక్షరరూపం రాధేయ కవిత్వం అని రచయిత పలమనేరు బాలాజీ అన్నారు. ఆదివారం గంగవరంలోని కళామందిరంలో ప్రముఖ కవి, విమర్శకుడు డాక్టర్ ఉమ్మడి శెట్టి రాధేయ కవితా సంపుటి పావుకోళ్లు ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మగ్గం బతుకు కవితాసంపుటితో అన్ని ప్రాంతాల పాఠకులను రాధేయ ఆకట్టుకున్నారన్నారు. అనంతరం రాధేయకు జ్ఞాపికను అందించి సత్కరించారు. అంతకుముందు ప్రముఖ కవి అందెశ్రీ మృతికి నివాళులర్పించారు.ఐఆర్ఎస్ అధికారి జెల్లి విద్యాధరరావు, కవులు పెళ్లూరు సునీల్, అంకె శ్రీనివాస్, సుధా మురళి, వీణాబాయి, పి.శివకుమార్, పల్లిపట్టు నాగరాజు, కేవీ మేఘనాథ్, శ్రీనివాస, డి.కుమారస్వామి రెడ్డి, తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్ష కార్యదర్శులు తులసీనాథం నాయుడు, పుష్ప, రచయిత్రులు ఝాన్సీ పాపుదేశి, గండికోట వారిజ పాల్గొన్నారు.

నేటి నుంచి ఎస్వీయూలో అంతర్జాతీయ సదస్సు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీలో సోమవారం నుంచి అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఇన్ఫర్మేషన్ అండ్ లైబ్రరీ నెట్‌వర్క్ సెంటర్ - ఎస్వీయూ లైబ్రరీ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్ట నున్నాయి. లైబ్రరీ 2047 - డెమొక్రటైజింగ్ నాలెడ్జ్ టువర్డ్స్ వికసిత్ భారత్ అంశంపై చేపట్టనున్న ఈ సదస్సు మూడు రోజుల పాటు కొనసాగనుంది. ప్రారంభ సభ ఎస్వీ యూ శ్రీనివాసా ఆడిటోరియంలో నిర్వహిస్తారు. ఇగ్నో యూనివర్సిటీ వీసీ ఉమా కంజిలాల్, ఎస్వీయూ వీసీ నరసింగరావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ విజయభాస్కరరావు, ఇన్‌ఫ్లిబ్‌నెట్ డైరెక్టర్ దేవిక పి.మదల్లి, శ్రీలంక లోని యువ వెల్లాస యూనివర్సిటీ వీసీ కొలిత విజయశేఖర పాల్గొంటారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

భవిష్యత్తుకు తొలిమెట్టు గ్రంథాలయం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న గ్రంథాలయాధికారి సత్యవాణి, ప్రముఖులు

కుప్పం, నవంబరరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయం తమ కెరీర్‌కు మొదటి మెట్టని ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో ఉద్యోగాలు పొందిన ఉపాధ్యాయులు పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని కుప్పం శాఖా గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయాన్ని మొదటి మెట్టుగా ఉపయోగించుకొని డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందిన ఐదుగురికి చిరు సత్కారం చేశారు. సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు మురుగేశ్, సింగారవేలు, పూజ, మానస, ఆనంద్ మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని అభివర్ణించారు. వీటికి సక్రమంగా ఉపయోగించుకుంటే వ్యక్తిత్వ, జీవితోన్నతికి ఎంతో దోహదపడుతాయన్నారు. బాలలు, యువత గ్రంథాలయాన్ని, అందులోని గ్రంథాలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. సన్మానం అనంతరం చదవడం నాకిష్టం అనే అంశంపై సబ్ జూనియర్స్‌కు, పదాలు వెదకడం, కలరింగ్, చిత్రలేఖనం అంశాలలో జూనియర్స్, సీనియర్స్‌కు పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి సత్యవాణి ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యేంద్రశేఖర్, గోపీనాథ్, మంజునాథ్, కనకవల్లి తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం విజయవంతం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కుప్పం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సాయిమాతా సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. కుప్పం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణల జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో బెంగళూరులోని శంకర కంటి ఆస్పత్రి వైద్య సిబ్బంది కంటి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 200 మంది రోగులను పరీక్షించి 44 మందిని ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు సాయిమాతా సేవా ట్రస్టు అధ్యక్షుడు జగదీశ్‌బాబు తెలిపారు. ఎంపిక చేసిన వారికి బెంగళూరు శారద కంటి ఆస్పత్రిలో ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్య సిబ్బంది శివప్రకాశ్, వీరభద్రప్ప పాల్గొన్నారు.

పాఠశాలలో భోజనశాల ప్రారంభం



భోజనశాలను ప్రారంభిస్తున్న దాతలు

సోమల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సోమల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి అనువుగా విద్యార్థుల కోసం రూ.1.85 లక్షలతో నిర్మించిన భోజనశాలను ఆదివారం దాతలు, పూర్వవిద్యార్థి కర్రి జ్యోతీశ్వరుడు, కుమారుడు చేతన్ కుమార్, కుమార్తె విష్ణుప్రియ నిర్మించారు. ఈక్రమంలోనే దాతలచే భోజనశాలను ప్రారంభించారు. దాతలను ప్రధానోపాధ్యాయులు హేమ సుధాకర్, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సూర్యప్రకాశ్, అరుణ, మమత, సుశీల, శోభారాణి, మునిరత్నం, పురుషోత్తం, పీడీ కరుణానిధి తదితరులు పాల్గొన్నారు.

కందూరులో చైతన్యజ్యోతి ర్యాలీ



కందూరులో అఖండ జ్యోతి ర్యాలీ

సోమల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కందూరు కైలాస పిరమిడ్ ఆశ్రమం ఆధ్వర్యంలో చైతన్యజ్యోతి ర్యాలీని నిర్వహించారు. ఆదివారం స్థానిక ఆశ్రమంలో అఖండజ్యోతి వెలిగించి ధ్యానంపై అవగాహన కల్పించారు. అనంతరం అఖండ జ్యోతితో కందూరు, వల్లిగట్ల, పగడాలవారిపల్లె, రెడ్డివారిపల్లె, మిట్టపల్లెలో ప్రచారం చేశారు.

శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ప్రతిష్ఠకు రూ.6 లక్షల విరాళం



విగ్రహ ఏర్పాటుకు విరాళం అందజేసిన దాతలు

సోమల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సోమల పట్టణంలో శ్రీకృష్ణదేవరాయ విగ్రహ ప్రతిష్ఠకు ఎస్.నడింపల్లెకు చెందిన జీఎల్. మోహన్‌కుమార్, జిల్లా జడ్జి (తెలంగాణ), డాక్టర్ జీఎల్. శ్రీదేవి దంపతులు రూ. 6 లక్షలు విరాళం అందజేసినట్లు కమిటీ అధ్యక్షులు మునివెంకటప్ప తెలిపారు. ఈక్రమంలో ఎస్.నడింపల్లె సర్పంచి కర్రి వెంకటరమణ, మాజీ సర్పంచులు సదాశివయ్య, శ్రీరాములు, సీఎం.సురేశ్, జ్యోతీశ్వరుడు, సాంబశివయ్య, జీఎల్. సీతారామయ్య, గిరిధర్ , జగన్, జీసీకే. ప్రసాద్, నంద తదితరులు దాతలకు అభినందలు తెలిపారు.

ఆలయంలో అన్నప్రసాదం ప్రారంభం



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

సదుం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సదుం మండలం ఎర్రాతివారిపల్లె కోటమల్లెపై వెలసిన అయ్యప్ప స్వామి ఆలయంలో భక్తులకు ఆదివారం అన్నప్రసాదం ప్రారంభించారు. ఆలయ వ్యవస్థాపకులు, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఏటా కార్తీక మాసం మొదలు జనవరి 14న మకర జ్యోతి వరకు మూడు పూటలా అన్నప్రసాద వితరణ నిర్వహిస్తారు. మాలధారణ చేసిన భక్తులతోపాటు సాధారణ భక్తులు వేల సంఖ్యలో అన్నప్రసాదాన్ని స్వీకరిస్తుంటారు. అయ్యప్ప భక్తులకు రాత్రి బస చేసే వసతి కల్పించారు.

నేడు టీడీపీ సంస్థాగత కమిటీల ఏర్పాటు

రొంపిచెర్ల, నవంబరు16(ఆంధ్రజ్యోతి): తిరుపతి- మదనపల్లె జాతీయ రోడ్డు మార్గం రొంపిచెర్ల మండలం పెద్దగొట్టిగల్లు సమీపంలోని వీఎంఆర్ ఫంక్షన్ హాలో 17వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు పుంగనూరు నియోజకవర్గంలోని ఆరు మండలాలకు సంబంధించి టీడీపీ సంస్థాగత కమిటీల ఎన్నికలు జరుగుతాయని రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టరు ఉయ్యాల రమణ తెలిపారు. చల్లా రామచంద్రారెడ్డితో పాటు పార్టీ పర్యవేక్షకులు హాజరవుతారన్నారు. నాయకులు, కార్యకర్తలు, టీడీపీ కుటుంబ సభ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహార కిట్లను అందుకున్న విద్యార్థులు

గంగవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చెన్నై కు చెందిన లవ్ ఇన్ యాక్షన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక లయన్స్ క్లబ్ ఆవరణలో ట్రస్ట్ తరఫున పలమనేరు, పుంగనూరు పరిసర ప్రాంతాలకు చెందిన 150 మంది నిరుపేద కుటుంబాలకు నెలకు సరిపడే 20 రకాల నిత్యావసర వస్తువులు ఒక కిలో చొప్పున అందించారు. అలాగే పండ్లు, కోడిగుడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ కోఆర్డినేటర్ రామచంద్రయ్య తెలిపారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించిన హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు శివ తదితరులు

పలమనేరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పలమనేరులోని హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు ఆదివారం ఓ అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించారు. పెద్దపంజాణిలో ఈనెల 14న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఇతని ఆచూకీ కోసం పలమనేరు మార్చురీలో రెండురోజుల పాటు ఉంచి విచారించినా ఎవరూ రాకపోవడంతో అనాథగా భావించి పెద్దపంజాణి పోలీసుల సూచన మేరకు అనాథకు ఆదివారం పలమనేరు హిందూ స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు శివ, షన్ముఖ తేజ, నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో భారీ మెజారిటీయే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న మునిరత్నం

రామకుప్పం/శాంతిపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక ఎన్నికల్లో అన్ని స్థానాల్లో ఎన్డీఏ అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలుపొందేలా టీడీపీ నేతలు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఏపీఎస్‌ఆర్టీసీ వైస్‌చైర్మన్ మునిరత్నం, టీటీడీ బోర్డు సభ్యుడు శాంతారాంలు కోరారు. ఆదివారం శాంతిపురం మండలం రాళ్ల బూదుగూరులో నిర్వహించిన పంచాయతీ కమిటీ సభ్యుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి, అమలవుతున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని వారు సూచించారు. ముఖ్యంగా కుప్పం నియోజకవర్గంలో వేలాది కోట్లతో జరుగుతున్న అభివృద్ధి, హంద్రీ -నీవా ద్వారా కృష్ణాజలాల రాక, పరిశ్రమల ఏర్పాటు తదితర కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నందింగం ఉదయ్‌కుమార్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు

కార్తీక వన భోజనాలు



పిచ్చిగుంట్లపల్లెలో ఉసిరిచెట్టుకు పూజలు చేస్తున్న మహిళలు

పుంగనూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా ఆదివారం పుంగనూరు ఆర్యవైశ్యులు, పిచ్చిగుంట్లపల్లె గ్రామస్తులు వేర్వేరుగా కార్తీక వన భోజనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పిచ్చిగుంట్లపల్లె ప్రజలు గ్రామ సమీపంలోని ఉసిరిచెట్టుకు పూజలు చేసి పక్కనే పొలాల్లో వన భోజనాలు చేసి సందడి చేశారు. అలాగే ఆర్యవైశ్యులు స్థానిక గూడూరుపల్లె లక్ష్మీనరసింహ స్వామి ఆలయం వద్ద కార్తీకమాసం సందర్భంగా మహిళలు పూజలు చేశారు. వివిధ రకాల ఆటల పోటీలతో ఉల్లాసంగా గడిపారు.

ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించాలి



మదనపల్లె సభకు తరలి వెళుతున్న పుంగనూరు మాలమహానాడు నాయకులు


పుంగనూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకించే వరకు ఉద్యమిస్తామని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్ హెచ్చరించారు. ఆదివారం అన్నమయ్య జిల్లా మదనపల్లెలో నిర్వహించే మాలమహానాడు మహా సభకు పుంగనూరు నుంచి అధిక సంఖ్యలో మాలలు తరలివెళ్లారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశంలో దళిత సంఘ నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో విద్యార్థికి గాయాలు

పుంగనూరు రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల దాడిలో ఆదివారం ఓ విద్యార్థి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నాడు. పుంగనూరు మండలం భీమగానిపల్లె పంచాయతీ మొరుంపల్లె గ్రామానికి చెందిన మూడో తరగతి చదువుతున్న విద్యార్థి మోక్షిత్(8) వీధిలో ఆడుకుంటుండగా వీధికుక్క కాలుకు కరిచి దాడి చేసి గాయపరచడంతో గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే మోక్షిత్‌ను ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు.

ఎస్టీవో కార్యాలయానికి
నూతన భవన యోగమెప్పటికో..!

అవస్థలు పడుతున్న వృద్ధులు, దివ్యాంగులు



దుస్థితిలో ఉన్న పలమనేరు ఎస్టీవో కార్యాలయం



అద్దె భవనంలోని పై అంతస్తులో ఉన్న కార్యాలయం



నూతన భవన నిర్మాణానికి వేసిన శిలాఫలకం

పలమనేరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పలమనేరులోని ఉపఖజానా కార్యాలయం పై అంతస్తులో ఉన్నందున వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలమనేరు నియోజకవర్గంలోని ఉద్యోగులు, పెన్షనర్లు జీతభత్యాలే కాకుండా పంచాయతీలకు సంబంధించిన నిధులు విడుదల తదితర కార్యకలాపాలు నిర్వహించేందుకు పలమనేరులో ఉపఖజానా కార్యాలయాన్ని దశాబ్దాల క్రితం ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కార్యాలయాన్ని బ్రిటీష వారు నిర్మించిన 100 ఏళ్లకు పైబడిన భవనంలో ప్రారంభించారు. అయితే ఈ భవనం పాలకుల నిర్లక్ష్యం కారణంగా సరైన నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుకొంది. గత మూడు దశాబ్ధాలుగా శిథిలావస్థలో ఉన్న ఎస్టీవో కార్యాలయానికి నూతన భవనం మంజూరు చేయాలన్న ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు. 2019లో సార్వత్రిక ఎన్నికల ముందు అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి, ఇప్పటి ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పలమనేరులో నూతన ఉపఖజానా భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకొన్నారు. పట్టణ సమీపంలోని మహిళా పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఉన్న స్థలంలో నూతన ఎస్టీవో కార్యాలయం భవనం నిర్మించేందుకు 2019లో రూ.1.08 కోట్లు నిధులు మంజూరు చేసి భవన నిర్మాణానికి శంఖుస్థాపన చేసి శిలాఫలకం వేశారు. అయితే ఆ తర్వాత జరిగిన ఎన్నికల అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ భవన నిర్మాణానికి నిధులు విడుదల చేయలేదు. రెవెన్యూ అధికారులు స్థలాన్ని కేటాయించలేదు. అయితే ఎస్టీవో అధికారుల ప్రయత్నంతో రెవెన్యూ అధికారులు ఎస్టీవో కార్యాలయ నూతన భవన నిర్మాణానికి 5 సెంట్ల స్థలాన్ని మాత్రమే కేటాయించారు. అయితే గత తెలుగుదేశ ప్రభుత్వ హయాంలో ఉపఖజానా కార్యాలయ భవనానికి శంఖుస్థాపన చేసిన ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఇప్పుడు మళ్లీ అధికారంలో ఉన్నందున ఈ ఉపఖజానా కార్యాలయానికి నూతన భవనం నిర్మించేందుకు నిధులు మంజూరు చేసి భవననిర్మాణం పూర్తిచేయాలని ఉద్యోగులు, ప్రజలు కోరుతున్నారు.

అద్దె భవనంలో అగచాట్లు

శిథిలావస్థలో ఉన్న భవనంలోని ఉపఖజానా కార్యాలయాన్ని అధికారులు నాలుగేళ్ల క్రితం గత్యంతర లేక అద్దెభవనంలోకి మార్చారు. అయితే ఈ అద్దెభవనంలోని పై అంతస్తులో ఉపఖజానా కార్యాలయం ఏర్పాటు చేయడంతో వృద్ధులు లైఫ్ సర్టిఫికేట్ ఇచ్చేందుకు పైఅంతస్తులోని కార్యాలయానికి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని శాఖల్లోని దివ్యాంగులు ప్రతినెలా ఈ కార్యాలయానికి బిల్లులు తీసుకొచ్చేందుకు సైతం ఇబ్బందులు పడుతున్నారు. ఇరుకైనా మెట్లపై దివ్యాంగులు పైకి ఎక్కలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇరుకైన గదుల్లో ఉన్న ఈ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు ఇకనైనా స్పందించి ఉపఖజానా కార్యాలయాన్ని కింద అంతస్తులో ఉన్న భవనంలోకి మార్చుచేయాలని పలువురు దివ్యాంగులు, వృద్ధులు కోరుతున్నారు.

ఏనుగుల కదలికపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఫ్‌బీవో బాలు

రామకుప్పం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం ననియాల అటవీప్రాంతంలో జంట ఏనుగులు మకాం వేసి ఉన్నాయని స్థానిక అటవీ బీట్ అధికారి బాలు తెలిపారు. ఆదివారం రాత్రి కుప్పం అటవీ రేంజ్ అధికారి జయశంకర్ ఆదేశాల మేరకు ఆయన ననియాలలో ఏనుగు కదలికపై రైతులకు అవగాహన కల్పించారు. అడవిలో మకాం వేసిన ఏనుగులు పొలాల వైపు వచ్చే అవకాశం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. అలాగే రైతులెవరూ చీకటి పడ్డాక పొలాల వద్దకు వెళ్లరాదని, ఏనుగుల సంచారంపై వెంటనే తమకు సమాచారం అందించాలని ఆయన సూచించారు. సాధ్యమైనంత వరకు తమతో పాటు ట్రాకర్లు ఏనుగులు కదలికలను పసిగట్టి అవి అడవికే పరిమితమయ్యేలా చూస్తున్నామని ఆయన భరోసా ఇచ్చారు.


ఆహ్లాదకరంగా వనభోజనం



మాట్లాడుతున్న ఎన్జీవో సంఘ నాయకులు ఆనంద్‌బాబు

గంగవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పత్తికొండ గజారామంలో పీపీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం వనభోజన కార్యక్రమం ఆహ్లాద వాతావరణంలో నిర్వహించినట్లు ఏపీ ఎన్జీవో సంఘ నాయకులు, పీపీఎస్ నాయకులు ఆనంద్‌బాబు, నరసింహులు పేర్కొన్నారు. కార్యక్రమానికి పలమనేరు, గంగవరం పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో దంపతులు, పిల్లలు హాజరయ్యారు. పిల్లలకు, పెద్దలకు వేర్వేరుగా ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పీపీఎస్ నాయకులు విజయకుమార్ రెడ్డి, పొన్ముడి, శ్రీపురం సీతారామయ్య, సుబ్రహ్మణ్యం పిళ్లై, నారాయణ, రామచంద్ర, సన్నీరాజు, విజయ్‌కుమార్, రెడ్డెప్ప, నాగప్ప, వెంకట్, దొరస్వామిలతోపాటు పలువురు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న లైబ్రేరియన్

పుంగనూరు రూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పుంగనూరు గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు వ్యాసరచన నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు గ్రంథాలయాలతో కలిగే ప్రయోజనాలపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ఇస్తామని లైబ్రేరియన్లు తులసీనాయక్, నసీబ్ జాన్ వివరించారు.

ఘనంగా కార్తీక మాసోత్సవాలు



కార్తీక దీపాల వెలుగులు

రామకుప్పం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ శివార్లలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో కార్తీక మాసోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. రాత్రికి భక్తులు ఆలయం వద్దకు చేరుకుని ఆలయం వద్ద, వెనుకన గల త్రిమూర్తి, నక్షత్ర, నవగ్రహ, రాశీ వనాల్లో కార్తీక దీపాలు వెలిగించారు. కార్తీక దీపాలతో ఆలయంతోపాటు వనాలు దేదీప్యమానంగా వెలుగులను సంతరించుకున్నాయి. ఆలయ నిర్వాహకులు ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

మానసిక ఒత్తిడితోనే గుండె జబ్బులు



గుండె జబ్బులపై అవగాహన కల్పిస్తున్న తిరుపతి స్విమ్స్ వైద్యులు

పుంగనూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మానసిక ఒత్తిడితోనే గుండె జబ్బులు వస్తాయని తిరుపతి స్విమ్స్ వైద్యశాల ప్రొఫెసర్. సీపీఆర్ నిపుణులు డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక అక్షర ప్రీస్కూల్ ఆవరణలో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో గుండె జబ్బు వచ్చిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు నానబాల గణేశ్, రాజారెడ్డి, డాక్టర్ విజయకుమారి, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ శరన్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ జాన్‌అనిల్‌కుమార్, భాస్కర్‌శెట్టి, మునిరాజ, హరిప్రసాద్, ఏసీ నారాయణరెడ్డి, నరసింహారెడ్డి, హరినాథరెడ్డి , విజయకుమార్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుతో గ్రామాల అభివృద్ధి



అత్తికుప్పంలో సీసీరోడ్డు పనుల ప్రారంభోత్సవంలో నేతలు

రామకుప్పం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్రకు రెండోసారి చంద్రబాబు సీఎం కావడంతో రాష్ట్రంలో గ్రామాలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయని ఐటీడీపీ జిల్లాకార్యనిర్వాహక కార్యదర్శి జ్ఞానశేఖర్ రెడ్డి, ఆత్మా మాజీ డైరెక్టరు రామలింగారెడ్డి, టీడీపీ మణీంద్రం పంచాయతీ అధ్యక్షుడు మంజునాథ్‌రెడ్డి తెలిపారు. మణీంద్రం పంచాయతీలో రూ.40 లక్షలతో చేపట్టిన సీసీరోడ్ల నిర్మాణపు పనులను వారు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనలో గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపడక ప్రజలు అవస్థలు పాలయ్యారన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు సీఎం, డీసీఎంలుగా గ్రామాల అభివృద్ధికి విరివిగా నిధులు విడుదల చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అరుణ, నేతలు భానుమూర్తి, నాగరాజు, శ్రీరాములురెడ్డి, మోహన్, చిరంజీవి, మంజునాథ్ పాల్గొన్నారు.

సొన్నేగానిపల్లెలో ఉచిత వైద్యసేవలు



వైద్యశిబిరంలో పాల్గొన్న వైద్యులు, క్లబ్ సభ్యులు

రామకుప్పం/శాంతిపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం లయన్స్ క్లబ్, బెంగళూరు వైదేహి ఆస్పత్రుల ఆధ్వర్యంలో ఆదివారం మండల పరిధి సొన్నేగానిపల్లెలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 200 మందికి పైగా రోగులకు చికిత్సలందించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ మొదటి వైస్ ప్రెసిడెంట్ మురుగేష్, కార్యదర్శి బాబు, సభ్యులు సుధాకర్, మునేగౌడ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు -లారీ ఢీ
● ప్రయాణికులకు స్వల్ప గాయాలు

పుంగనూరు రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు మండలం గూడూరుపల్లె క్రాస్ వద్ద ఆర్టీసీ బస్సు - లారీ ఢీకొనడంతో ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడిన సంఘటన ఆదివారం జరిగింది. వివరాలిలా.. చిత్తూరు ఆర్టీసీ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు పుంగనూరుకు వస్తుండగా మదనపల్లె వైపు నుంచి తమిళనాడుకు వెళుతున్న లారీ ఢీకొంది. పలువురు ప్రయాణికులకు చిన్నచిన్న గాయాలు తగిలి పెద్ద ప్రమాదం నుంచి తప్పించుకున్నారు.

ఎంఎస్ఎంఈ డైరెక్టర్‌కు సన్మానం


చినబాబును సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

నగరి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్‌గా నియమితులైన ఎం.మురళీమోహన్ (చినబాబు)ను టీడీపీ నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. నగరి పీఏసీఎస్ అధ్యక్షుడు కె.బాలాజీ మండల టీడీపీ అధ్యక్షుడు జవహర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు సెల్వమణి, నగరి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కుమార్‌నాయుడు,మాజీ ప్రధాన కార్యదర్శి పరందామనాయుడు, తెలుగు యువత ధనంజయలు, అల్లిముత్తు, కుమార్ తదితరులు చినబాబును సన్మానించిన వారిలో ఉన్నారు.

గోశాలకు గ్రాస్ కటింగ్ మిషన్ విరాళం


గ్రాస్ కటింగ్ మిషన్‌లో గడ్డి పెడుతున్న ఈఓ

ఐరాల(కాణిపాకం), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుని ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాలకు ఏలూరు వేగివాడకు చెందిన మాధవి గ్రాస్ కటింగ్ మిషన్‌ను ఆదివారం విరాళంగా అందించారు. ఈసందర్భంగా ఈవో పెంచలకిషోర్ మాట్లాడుతూ గ్రాస్ కటింగ్ మిషన్ రూ.50,000 విలువ ఉంటుందన్నారు. విరాళదాతకు ఆలయ మర్యాదలతో స్వామి దర్శనం కల్పించారు. కార్యక్రమంలో గోశాల ఏఈవో ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతులకు రూ.8 చెల్లించండి



సమావేశంలో పాల్గొన్న రైతు సంఘం నాయకులు

తవణంపల్లె, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతులకు రూ.8 గుజ్జు పరిశ్రమలు వెంటనే చెల్లించాలని జిల్లా మామిడి రైతు సంఘం డిమాండ్ చేశారు. ఆదివారం అరగొండ కోదండ రామాలయంలో జిల్లా రైతు సంఘం ఆధ్వర్యంలో మామిడి రైతుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మునీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ గుజ్జు పరిశ్రమలకు రైతులు కాయలు సరఫరా చేసిన 15 రోజుల్లో కిలోకు రూ.8 ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలున్నా మామిడి కాయలు సరఫరా చేసి ఆరు నెలలు గడుస్తున్నా చెల్లించకపోవడం దారుణమన్నారు. వెంటనే రైతులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు మోహన్ రెడ్డి, సందీప్, మునిరత్నం, జనార్ధన్ యాదవ్, రైతులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ


విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న వెంకటేశ్వరరావు

నింద్ర, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యకు పెద్దపీట వేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని నింద్ర పీఏసీఎస్ చైర్మన్, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం నింద్రలోని బీసీ హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేద విద్యార్థుల సంక్షేమం కోసం మంత్రి లోకేష్ కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నారన్నారు. అనంతరం విద్యార్థులకు దుప్పట్లు, కార్పొరేట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పెరుమాళ్‌రెడ్డి, పరదేశి, భాస్కర్, శరవణ, ఏబిరాజ్, వెంకటేష్, ప్రకాష్, రాము, జనార్దన్ నాయుడు, కోదండరెడ్డి, వార్డెన్ పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలుడి కల్యాణోత్సవం

నింద్ర, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కచ్చరవేడులో నిర్మించిన రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం మండల పూజలో భాగంగా కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. కుంభాభిషేకం అనంతరం 48వ రోజు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమం, నిర్వహించారు. అనంతరం వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా వేద పండితులు నిర్వహించారు. భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరిగింది. రాత్రి దేవతా మూర్తులను వివిధ పుష్పాలతో విశేషంగా అలంకరించి ఊరేగించారు.

ప్రమాణ స్వీకారానికి తరలిన టీడీపీ శ్రేణులు



పాలసముద్రం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పెనుమూరులో ఆదివారం జరిగిన మండల టీడీపీ అధ్యక్షుడు తాళ్వార శివానాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మండలంలోని 13 పంచాయతీల నుంచి టీడీపీ నాయకులు,కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. రంగాపురం కూడలి ప్రాంతంలో నాయకులంతా కలసి ర్యాలీగా బయలుదేరి పెనుమూరులో ప్రమాణ స్వీకారం వేదిక వద్దకు చేరుకున్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి సాంబశివన్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అరుళ్‌నాథన్, నాయకులు బాలాజీయాదవ్, బాలాజీ నాయుడు, శేఖర్‌రాజు, భాస్కర్ నాయుడు, నవీన్‌చౌదరి, రమేష్ యాదవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు నగరపాలక సంస్థ కార్యాలయంలో పీజీఆర్ఎస్

చిత్తూరు అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నగరపాలక కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ నరసింహ ప్రసాద్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరిస్తామని తెలిపారు. బాధిత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమానికి సంబంధిత అధికారులు హాజరవ్వాలని కోరారు.

19న ప్రత్యేక విద్యుత్ అదాలత్

చిత్తూరు రూరల్ నవంబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకు ఈ నెల 19న పైపల్లి సబ్ డివిజన్ కార్యాలయ ఆవరణలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అదాలత్‌కు చిత్తూరు ఆపరేషన్ డివిజన్ పరిధిలోని చిత్తూరు టౌన్, బంగారుపాళ్యం, రెడ్డిగుంట, పైపల్లెకు చెందిన విద్యుత్ వినియోగదారులు హాజరు కావచ్చని ఆయన పేర్కొన్నారు. రిటైర్డ్ జడ్జి ద్వారా సమస్యలు పరిష్కారమవుతాయన్నారు.

పంచాయతీ కార్యదర్శి గుండెపోటుతో మృతి

గుడిపాల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏఎల్‌పురం పంచాయతీ కార్యదర్శి మాధవ(62) ఆదివారం గుండెపోటుతో చనిపోయారు. కుప్పిగానివానిపల్లెలోని తన ఇంట్లో ఉండగా రాత్రి గుండెపోటు వచ్చి కుప్పకూలారు. వెంటనే ప్రాణం విడిచారు. ఈయనకు భార్యకుమారుడు ఉన్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ఈయన రిటైర్ కావల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వృద్ధుడి మృతి


మృతి చెందిన మొగిలిశెట్టి

బంగారుపాళ్యం నవంబర్ 16(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వృద్ధుడు చికిత్స పొందుతూ చని పోయాడు. సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపిపి వివరాల మేరకు కల్లూరుపల్లెకు మొగిలిశెట్టి(72) ఈనెల 1న ద్విచక్రవాహనం మీద వెళ్తుండగా. కేజీ సత్రం వద్ద వెదురుకుప్పం మండలం చవటివారిపల్లె గ్రామానికి చెందిన భానుప్రకాష్ చిత్తూరు ద్విచక్రవాహనంతో ఢీకొట్టాడు. మొగిలిశెట్టి తలకు బలమైన గాయాలవడంతో చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తమిళనాడులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు.,మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

బంగారుపాళ్యం నవంబర్ 16(ఆంధ్రజ్యోతి): ఓ బాలిక అదృశ్యమైంది. సీఐ కత్తిశ్రీనివాసులు తెలిపిన వివరాలిలా... చిల్లగుండ్లపల్లెకి చెందిన మనోహర్,దీప దంపతుల కుమార్తె హంసవేణి(17) ఈ నెల 12 నుంచి కనిపించడంలేదున అన్ని చోట్లా వెతికి విఫలమై బాలిక తల్లి దీప పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



బంగారుపాళ్యం నవంబర్ 16(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయవారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని గ్రంథాలయంలో విద్యార్థులకు ఆదివారం వ్యాస,చిత్రలేఖన పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి శ్రీకాంత్ రెడ్డి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గ్రంథాలయాల స్థాపనకు కృషి చేసిన ఎస్ఆర్ రంగనాథన్,అయ్యంకి వెంకటరమణల గురించి విద్యార్థులకు తెలియజేశారు. రిటైర్డు హెచ్ఎం జోహార్,మహర్షి రాక్ ఫోర్డు స్కూల్ హెచ్ఎం మౌనికలు విద్యార్థులకు వ్యాస,చిత్రలేఖన పోటీలు నిర్వహించారు.

కల్వర్టుపై గొయ్యితో ప్రమాదాలు



చిత్తూరు సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కల్వర్టుపై గొయ్యితో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. స్థానిక మిట్టూరులోని నాయుడు బిల్డింగ్స్ (శ్రీదుర్గ హోటల్)పక్కన, విజయం కళాశాల, ఆర్‌కే కళాశాల, ఎస్‌బీఐ రీజనల్ కార్యాలయం, మిట్టూరుకు వెళ్ళే మార్గంలోని కల్వర్టు దెబ్బతిని గొయ్యి ఏర్పడింది. నిత్యం ఈ మార్గంలో స్కూల్ బస్సులు, కార్లు, ద్విచక్రవాహనాలు, వందలాది మంది విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడున్న దుకాణాలకు లారీలు, ఆటోలు, టాటా ఏస్ వంటి వాహనాలు సైతం లోడ్లుతో రాకపోకలు సాగిస్తుంటాయి. పాదచారులు, విద్యార్థులు, ద్విచక్ర వాహనదారులు ఈ గొయ్యిని గమనించక ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతులు చేయకపోతే మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భోజనశాలకు దాతల వితరణ

సోమల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉన్నత పాఠశాలలో రూ.1.85 లక్షలతో పూర్వవిద్యార్థి కర్రి జ్యోతీశ్వరుడు, కుమారుడు చేతన్ కుమార్, కుమార్తె విష్ణుప్రియ నిర్మించిన భోజనశాలను ఆదివారం నిర్మించారు. ఆదివారం ఇది ప్రారంభమైంది.

ఈ రోడ్లపై ప్రయాణం నరకయాతన


అక్కదేవతల కండిగ వద్ద రోడ్డంతా బురదమయం


తూగుండ్రం-గంగాధరనెల్లూరు రోడ్డు దుస్థితి ఇది

గంగాధరనెల్లూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తారురోడ్డు పనులు ప్రారంభించి అర్థాంతరంగా నిలిపివేయడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. చిత్తూరు-తచ్చూరు జాతీయ రహదారి నిర్మాణపనులు చేపట్టినప్పుడు ఆ మెటీరియల్‌ను గంగాధరనెల్లూరు-ముసలయ్యగారిపల్లె రోడ్డు మీదుగా తరలించేవారు. దీంతో ఈ మార్గం వాహనాల తాకిడికి గుంతలమయంగా మారింది. కంకర తేలిపోయింది. ఈమార్గంలో వాహనాలు వెళ్లడం ఇబ్బందికరంగా తయారైంది. వాహన చోదకులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. హైవేరోడ్డు నిర్మాణ పనులు పూర్తయినా దెబ్బతిన్న రహదారి గురించి పట్టించుకోవడంలేదు.. గంగాధరనెల్లూరు నుంచి ముసలయ్యగారిపల్లె వరకు పాత తారురోడ్డుపై గుంతలను పూడ్చేసి తారువేసేందుకు ఎస్ఆర్‌పురం మండలానికి చెందిన ఓ కాంట్రాక్టర్ రెండునెలలకు ముందు టెండర్ పొందినట్లు సమాచారం. ఆ కాంట్రాక్టర్ కొన్నాళ్ళ క్రితం సర్విరెడ్డిపల్లె బస్టాప్ వద్ద నుంచి వేపంజేరి సబ్‌స్టేషన్ వరకు కిలోమీటరు దూరం తారువేశారు. అక్కడితో పనులను నిలిపేశారు. ఏడు కిలోమీటర్ల ఈ రోడ్డులో ఇలా అరకొరగా పనులు నిలిపేయడంతో ప్రయాణాలు సాగించాలంటే నానావస్థలు పడుతున్నారు.

చినుకుపడితే బురదమయం

వీరకనెల్లూరు, అగరమంగళం పంచాయతీల మధ్య రెండున్నర కిలోమీటర్ల దూరం మేరకు మట్టిరోడ్డు గుంతలమయమైంది. వర్షం వేస్తే బురదమయంగా మారి రాకపోకలకు యాతన అవుతోంది. వైసీపీ ప్రభుత్వహయాంలో అప్పటి డిప్యూటీ సీఎం నారాయణ స్వామి గడప గడపకు కార్యక్రమానికి వచ్చినపుడు వినతులిచ్చినా స్పందించలేదు. కనీసం కూటమి ప్రభుత్వంలోనైన రాష్ట్ర ప్రభుత్వవిప్ థామస్ స్పందించి రోడ్డు సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

కష్టించి పనిచేసిన వారికి పదవులు

టీడీపీ నాయకుల ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే థామస్



టీడీపీ మండలాధ్యక్షులతో ప్రమాణస్వీకారం చేపిస్తున్న ఎమ్మెల్యే థామస్- హాజరైన టీడీపీ నాయకులు,కార్యకర్తలు

పెనుమూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కోసం కష్టపడి పనిచేసిన వారిని అధిష్ఠానం గుర్తించి మండల, క్లస్టర్, యూనిట్,బూత్ కమిటీ అధ్యక్ష పదవులు కట్టబెట్టిందని ఎమ్మెల్యే థామస్ అన్నారు. ఆదివారం పెనుమూరు మార్కెట్ యార్డులో జరిగిన కార్యక్రమంలో ఆరు మండలాల అధ్యక్ష పదవులు పొందిన వారితో ఆయన ప్రమాణ స్వీకారం చేయించారు. ముందుగా గాంధీ సర్కిల్ వద్ద ఎమ్మెల్యే మెడలో గజమాలతో వేసి పార్టీ శ్రేణులు సన్మానించాయి. మంగళవాయిద్యాల నడుమ అశేష జనవాహిని ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం సమావేశంలో థామస్ మాట్లాడుతూ పదవులు వచ్చిన వారందరూ అందరినీ కలుపుకొంటూ ముందుకు వెళ్లాలని సూచించారు. పదవులు రానివారు నిరాశపడకుండా క్రమశిక్షణతో పని చేస్తే భవిష్యత్తులో పదవులు వరిస్తాయన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందరుకు అందరూ సమైక్యంగా పనిచేయాలన్నారు. తొలుత మండల అధ్యక్షులుగా ఎన్నికైన రుద్రయ్యనాయుడు, జయశంకర్‌నాయుడు, స్వామిదాస్, తాళ్వారు శివ, మోహన్‌మురళి, చెంగళరాయయాదవ్‌లచేత థామస్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎమ్మెస్ఎమ్ఈ డైరెక్టర్ చినబాబు, రాష్ట్ర టీఎస్‌టీయూసీ కార్యదర్శి లోకనాథనాయుడు, రాష్ట్ర పొల్యూషన్ బోర్డు డైరెక్టర్ నాగేశ్వరరాజు, జిల్లా మహిళా అధ్యక్షురాలు కార్జాల అరుణ, నాయకులు శ్రీదర్‌యాదవ్, తలారిరెడ్డెప్ప, క్రిష్ణమనాయుడు, యాగమనాయుడు, చిరంజీవిరెడ్డితో పాటు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనారాయణుడి కల్యాణోత్సవం


మంగళసూత్రాలను చూపిస్తున్న అర్చకులు

గంగాధరనెల్లూరు, నవంబరు 16 (ఆంధ్ర జ్యోతి): వేపంజేరిలో వెలసిన లక్ష్మీనారాయణస్వామి కల్యాణోత్సవం ఆదివాకం వైభవంగా నిర్వహించారు. ఉదయం పూజలనంతరం శ్రీదేవి, భూదేవి సమేత నారాయణులను విశేషంగా అలంకరించారు. అర్చకులు వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. హైదరాబాద్‌కు చెందిన సరళారెడ్డి కల్యాణోత్సవం, అన్నదానం కార్యక్రమాలకు ఉభయదారులుగా వ్యవహరించారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టుకు చెందిన భాగవతారిణి లక్ష్మీరాజ్యం హరికథ వినిపించారు. ఆలయ మేనేజర్ నల్లా వెంకటేశులురెడ్డి, అర్చకులు విష్ణుస్వామి, గోవిందస్వామి,, గౌరీష్, మురళీస్వామి, భక్తులు పాల్గొన్నారు.

అలెన్‌తో న్యూయార్క్ స్కూల్ ఒప్పందం



ఒప్పంద పత్రాలతో అలెన్-న్యూయార్క్ స్కూల్ యాజమాన్య ప్రతినిధులు

చిత్తూరు సెంట్రల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ అడ్వాన్స్, నీట్, ఐఐటీ కోచింగ్‌ల కోసం నగరంలోని న్యూయార్క్ స్కూల్ యాజమాన్యం అలెన్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఆదివారం న్యూయార్క్ స్కూల్-విజ్ఞానసుధ విద్యాసంస్థల చైర్మన్ వి.శ్రీధర్, డైరెక్టర్ లీలా కుమారి అలెన్ కేరీర్ ఇన్స్టిట్యూట్ నుంచి అకడమిక్ హెడ్ రజిత్ భార్గవ్‌తో న్యూయార్క్ స్కూల్లో ఒప్పందం కుదుర్చుకున్నారు. వీరితో పాటు ముఖ్య అతిథిగా పాల్గొన్న అపోలో యూనివర్శిటీ ప్రొఫెసర్ కబిలన్‌లు మాట్లాడుతూ విద్యాప్రమాణాలు మెరుగుపర్చేందుకు న్యూయార్క్ స్కూల్లో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు అలెన్ సంస్థ ద్వారా జేఈఈ, నీట్, ఐఐటీలో కోచింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అలెన్ టీం సభ్యులు అమిత్, సూర్య, నాగమల్లయ్య, సావాన్ అగర్వాల్ పాల్గొన్నారు.

ఎన్‌జీవో అసోసియేషన్ కార్యవర్గం



చిత్తూరు అర్బన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్‌జీవో చిత్తూరు యూనిట్ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షులు కేవీ రాఘవులు ఆదేశాల మేరకు ఎన్నికల అధికారులు విక్రమ్, బాలసుబ్రహ్మణ్యంలతో పాటు ఎన్నికల పరిశీలకులుగా మురళీ మోహన్ ఎన్నికను నిర్వహించారు. యూనిట్ అధ్యక్షులుగా భానుప్రకాష్, సహాయ అధ్యక్షుడిగా గురునాథం, కార్యదర్శిగా ప్రసాద్‌బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా ప్రవీణ్, సుబ్రహ్మణ్యం, మురుగేశ్, పవన్‌కుమార్, మహిళా విభాగంలో సరిత, జాయింట్ సెక్రటరీలుగా సంతోష్‌బాబు, మనోహర్, బాలాజీ, కృష్ణ, గిరిధర్‌రావు, మహిళావిభాగంలో జాయింట్ సెక్రటరీగా సుమనప్రియ, కోశాధికారిగా సుభాన్‌బాషా, డీఈసీ కమిటీ సభ్యులుగా ముఖేష్, మహేష్‌లు ఎన్నికయ్యారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ అనీఫ్ బాషా

బంగారుపాళ్యం నవంబర్ 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని న్యూ ఫ్రెండ్స్ మెడికిల్స్ అండ్ క్లినిక్, సంరక్ష సూపర్ స్పెషాలిటీ(చిత్తూరు) సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పల్మోనాలజిస్టు డాక్టర్ అనీఫ్ బాషా శ్వాసకోశ వ్యాధులతో బాధపడే రోగులను పరీక్షించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. సుమారు 57 మంది రోగులు హాజరయ్యారని నిర్వాహకుడు సాహిల్ తెలిపారు. సంత వీధిలోని ప్రభుత్వ పాఠశాలలో గ్రేడ్స్, ఆర్‌వీఎస్ ఆసుపత్రి నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో వైద్యులు డాక్టర్ సాయి కిరణ్,డాక్టర్ ప్రసన్న,డాక్టర్ సాయి క్రిష్ణ,డాక్టర్ బబిత,డాక్టర్ సిబిన్,డాక్టర్ ప్రసూనలు రోగులను పరీక్షించి ఉచిత మందులు పంపిణీ చేశారు. ఆర్వీఎస్ పిఆర్‌వో ప్రతాప్, గ్రేడ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ శేషాద్రి,గోవింద్ లు పాల్గొన్నారు.

మండల టీడీపీ అధ్యక్షుడికి అభినందన


జయశంకర్‌నాయుడిని సన్మానిస్తున్న చంద్రబాబురెడ్డి

శ్రీరంగరాజపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ అధ్యక్షుడిగా ఎన్నికైన గంధమనేని జయశంకర్ నాయుడిని ఆదివారం పెనుమూరులో జరిగిన ప్రమాణీక్వారం మహోత్సవంలో మండల టీడీపీ యువత ఉపాధ్యక్షుడు చంద్రబాబురెడ్డి శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో గంధమనేని రాజశేఖర్ నాయుడు, నిరంజన్‌రెడ్డి, నరసింహారెడ్డి, ఎన్.కుమార్, రామక్రిష్ణయాదవ్, మహబూబ్ బాషా, పూజారి నాగారాజు, నోమేశ్వర్‌రెడ్డి సన్మానించారు.


పొక్లయినర్ ఢీకొని కూలీ మృతి

పూతలపట్టు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పొక్లయినర్ ఢీకొని ఓవ్యక్తి మృతి చెందాడు. తవణంపల్లె మండలం, పల్లె చెరువు గ్రామానికి చెందిన గిరి (42) పూతలపట్టు మండలం, మద్దెలయ్యగారి పల్లి దళితవాడలో వివాహం చేసుకుని అక్కడే కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో గిరి రంగంపేట క్రాస్ రోడ్డులో వెళుతుండగా పొక్లయినర్ ఢీకొంది. దీంతో అతను అక్కడిక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు దొరబాబు చౌదరి సంఘటనా స్థలానికి చేరుకుని మృతుని కుటింబీకులను పరామర్శించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

వాకర్లు సామాజిక సేవ చేయాలి

నగరి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సామాజిక సేవ వైపు ముందడుగు వేయాలని అసోసియేషన్ అధ్యక్షుడు రామచంద్రన్ అన్నారు. ఆదివారం కేవీకే మైదానంలో జరిగిన వాకర్స్ అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసోసియేషన్ ద్వారా తరచూ సమావేశాలు నిర్వహించి ఆరోగ్యపరమైన సలహాలు ఇస్తున్నామన్నారు. అసోసియేషన్ సభ్యులు సామాజిక సేవలోను ముందడుగు వేయాలన్నారు. అందరి సహకారంతో అప్పుడప్పుడూ వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఉచిత వైద్యసేవలు అందించడం, విద్యార్థులకు సహకారం అందించడం, మొక్కలు నాటడం లాంటి సామాజిక సేవలోను చొరవ చూపాలన్నారు. దేశమ్మదేవాలయ కమిటీ సభ్యునిగా నియమితులైన వాకర్స్ సభ్యులు సోమసుందరంను అసోసియేషన్ వారు సత్కరించారు.

మురుగుతో ముప్పుతిప్పలు



యాదమరి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాశిరాల పంచాయితీ, పెరుమాళ్లపెంట గ్రామస్థులు మురుగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామం నడిబొడ్డున డ్రైనేజీ నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు వ్యాప్తిచెందుతుండటంతో రోగాల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఈ సమస్యపై గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు వచ్చి పరిశీలించారు. వెంటనే కాలువలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కాలం గతిస్తున్నా ఇప్పటికీ సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. ఈ రోడ్డు మీదుగా నల్లపోతులూరు. లగడపాటూరు, భూమిరెడ్డిపల్లెతో పాటు ఇతర గ్రామాలవారూ రాకపోకలు సాగిస్తుంటారు.